క్లుప్తంగా

ఎన్నికల నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌ఓ శ్రీనివాస్

జగ్గంపేట: కేంద్ర ఎన్నిక సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో ఎన్నికల నియమావళి అమలుల్లోకి వచ్చిందని, ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జగ్గంపేట అసెంబ్లీ సెగ్మంట్ ఈఆర్‌ఓ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఈఆర్‌ఓ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్నికల కోడ్ పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ, ఇతర పార్టీలకు చెందిన నేతలు, ఎన్నికల సిబ్బంది, ఫ్లెక్స్ ప్రింటింగ్ యజమానులు పాల్గొన్నారు.

ఘనంగా వరబాపనమ్మ జాతర



వరబాపనమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గోకవరం: గ్రామ శివారున కొత్తపల్లికి వెళ్లే మార్గంలో వేంచేసిన వరబాపనమ్మ జాతర గురువారం ఘనంగా జరిగింది. జాతరను పురస్కరించుకుని ఆలయం వద్ద వేద పండితుడు వల్లూరి జగన్నాథశర్మ ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

విస్తృతంగా ఎస్ఈబీ దాడులు

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం విస్తృతంగా దాడులు చేసి పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ప్రత్తిపాడు ఎస్ఈబీ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. ఏలేశ్వరంలో 35 లీటర్ల సారా, ఎనిమిది లిక్కర్ బాటిల్స్‌తో బసంతుల రాజేశ్వరిని అరెస్టు చేశామన్నారు. ప్రత్తిపాడు మండలం వేములపాలెంలో 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అదే గ్రామంలో మరో 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని గ్రామానికి చెందిన తుట్టా అప్పలరాజుపై పరారీ కేసు నమోదు చేసినట్లు సీఐ చిరంజీవి వివరించారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై ఎం.ఆశాలత, హెడ్ కానిస్టేబుల్లు వెంకన్న దొర, కృష్ణార్జునరావు, సిబ్బంది దొరబాబు, రాజు, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఏలేశ్వరం డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ సునీత

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత సూచించారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మొక్కలు నాటడాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. మొక్కల పెంపకంతో వాతావరణ సమతుల్యత ఉంటుందన్నారు. సమాజంలో కాలుష్యాన్ని నియంత్రించడానికి ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ పీఓ ప్రగడ ప్రయాగమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, మదీనా, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



తుని అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ, తదితరులు

తుని: స్థానిక పెంటకోట రోడ్డులోని సాయి అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో అలయెన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేసినట్టు క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు కె.సత్యనారాయణ తెలిపారు. అలియెన్స్ క్లబ్ సభ్యుడు చించెలపు చిట్టిబాబు కుమారుడు సాయి జ్ఞాపకార్థం గురువారం వృద్ధులకు దుప్పట్లు, చీరలు అందజేశారు. పేదలకు అలయెన్స్ క్లబ్ సభ్యులు అందిస్తున్న సహకారం మరువలేనిదని సత్యనారాయణ అన్నారు. ఆశ్రమం ప్రతినిధులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించండి



మెరక చామవరంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న చలమలశెట్టి సునీల్, వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, వరుపుల సుబ్బారావు
- మెరకచామవరంలో ఎన్నికల ప్రచారం

రౌతులపూడి: సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు పిలుపునిచ్చారు. మండలంలోని మెరకచామవరంలో గురువారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. గడిచిన ఐదేళ్లలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికీ చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్వరాజ్య స్థాపన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతు భరోసా కేంద్రాల రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. అమ్మఒడి, జగనన్న గృహకల్ప, జగనన్న విద్యాదీవెన, రైతు భరోసా, అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా, చేయూత వంటి పథకాలను క్రమం తప్పకుండా నూరుశాతం అమలు చేసినట్టు తెలిపారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, పార్టీ నేత వాసిరెడ్డి జమీలు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, వైఎస్సార్ సీపీ నాయకులు పంతం బాబ్జీ, అడపా మురళి, యామన సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు గాది రాజుబాబు, కాకి నాని, రాయి ప్రసాద్, జిగిరెడ్డి సత్తిబాబు, రాపర్తి రామకృష్ణ, సర్పంచ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం



కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన ఉప్పాడ కొత్తపల్లి మండల నాయకులు

- మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అన్నారు. పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడ కొత్తపల్లి మండలానికి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీలు, పలువురు నాయకులు సుమారు 100 మంది గురువారం కిర్లంపూడిలోని ముద్రగడ స్వగృహానికి వచ్చి ఆయనను, యువ నాయకుడు ముద్రగడ గిరిబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో రాజకీయ పరిస్థితులపై ముద్రగడతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ అనుభజ్ఞుడైన ముద్రగడ పద్మనాభం వైఎస్సార్ సీపీకి పని చేయడం శుభపరిణామం అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విజయానికి శక్తివంచన లేకుండా పని చేస్తామన్నారు. ముద్రగడను కలిసిన వారిలో పొన్నాడ సర్పంచ్ బండి ధర్మరాజు (దావీద్), ఉమ్మిడి జాన్, నక్కా మణికంఠబాబు, రావి రమేష్, పులి జయబాబు, కంబాల లక్ష్మణరావు, పార్టీ మండల ప్రెసిడెంట్ అనాల సుదర్శన్, మాదిరెడ్డి దొరబాబు, శెట్టి బత్తుల నాని, జ్యోతుల బాబులు, గుండ్ర శ్రీధర్, ఉమ్మిడి చిన్న, కో ఆప్షన్ మెంబర్ కారే శ్రీనివాస్, ఎంపీటీసీ సుభాషిణి తదితరులు ఉన్నారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన రాష్ట్ర కాపు జేఏసీ మెంబర్ తోట రామకృష్ణ, ఉమ్మిడి పశ్చిమగోదావరి జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు చిన్నిమిల్లి వెంకటరాయుడు, పోతురెడ్డి శ్రీనివాస్, గర్రే శ్రీనివాస్, వాసంశెట్టి పరమేశ్వరరావు తదితరులు ముద్రగడను మర్యాదపూర్వకంగా కలిశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ ఏర్పాటు
- మరమ్మతులకు రూ.మూడు లక్షల సామగ్రి కొనుగోలు
- చర్చ లేకుండానే మండల సమావేశం వాయిదా



తాగునీటి ఎద్దడి నివారణపై పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న అధికారులు

తుని రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా పంచాయతీ కార్యదర్శులు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని గ్రామీణ తాగునీరు, పారిశుధ్య నిర్వహణ (ఆర్‌డబ్ల్యూఎస్) డీఈ ఎ.శివాజీ సూచించారు. స్థానిక మండలం పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ రవికుమార్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈ శివాజీ మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల వద్ద కొంతమంది మోటార్లు ఏర్పాటు చేసుకుని కుళాయి నీళ్లను తోడేస్తున్నారన్నారు. దీంతో ఎగువ ప్రాంతాల్లో నివాస గృహాలకు కుళాయిల ద్వారా నీరు అందడం లేదన్నారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. చేపూరు, లోవకొత్తూరు తదితర గ్రామాల్లో భూగర్భ జలాల నీటి మట్టం 350 అడుగుల లోతుకు పడిపోయిందన్నారు. ఫలితంగా బోరుబావులు మొరాయిస్తున్నాయని తెలిపారు. మోటార్లను క్రమబద్ధీకరించి, అవసరమైన ప్రాంతాల్లో కొత్త బోర్లు వేయించాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఇటీవల అందుబాటులోకి వచ్చాయన్నారు. ఎన్నికలు జరగని పంచాయతీలకు నిధులు రాకపోయినప్పటికీ మండల గ్రాంట్ వినియోగించుకోవాలని సూచించారు. పాడైన బోరుబావులకు మరమ్మతులు చేయించాలన్నారు. ఇందుకుగాను రూ.మూడు లక్షలతో విడిభాగాలు కొనుగోలు చేసినట్టు డీఈ తెలిపారు. తాగునీటి సమస్యలు 48 గంటల్లో పరిష్కరించేందుకు కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎక్కడైనా తాగునీటి సమస్యలు ఉంటే ప్రజలు 83280 74716 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. అంతకుముందు ఎన్నికల నియమావళి ఉండడంతో ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని చర్చ లేకుండా వాయిదా వేస్తున్నట్టు ఎంపీడీఓ రవికుమార్ ప్రకటించారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో టీడీపీకి షాక్



నున్నం రాంబాబుకు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న తోట రాంజీ

గోకవరం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో టీడీపీకి గట్టి షాక్ తలిగింది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, పార్టీ పోల్ మేనేజ్‌మెంట్ యూనిట్ కన్వీనర్ నున్నం రాంబాబు తన అనుచరులతో కలిసి టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. కొత్తపల్లిలో గురువారం జరిగిన కార్యక్రమంలో వారికి వైఎస్సార్ సీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంజీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులైన పలువురు ప్రతిపక్షాల నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని అన్నారు. రాంబాబు మాట్లాడుతూ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షితులపై, తోట నరసింహం పాలనా సమర్థతపై నమ్మకంతో వైఎస్సార్ సీపీలో చేరుతున్నామని చెప్పారు. త్వరలో సుమారు వెయ్యి మందితో పార్టీలో చేరికల కార్యక్రమం చేపడతామని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి
- భూపాలపట్నంలో ఎన్నికల ప్రచారం



భూపాలపట్నంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న తోట వాణి, శ్రీనిధి తదితరులు

కిర్లంపూడి: రాష్ట్ర ప్రజల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి అన్నారు. భూపాలపట్నంలో పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ ఆధ్వర్యంలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తోట వాణి, ఆమె కోడలు తోట శ్రీనిధి, పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బేరి బాబ్జీ, అరబోలు వాసు, ఎంపీటీసీ కొరిమిల్లి చందు, తిబిరిశెట్టి వీరగణేష్, తిబిరిశెట్టి రామకృష్ణ, అత్తి భద్రం, గొంతిన రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పెనగంటి రాజేష్, ఓలేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయండి



రంపయర్రంపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట రాంజీ

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ
- రంపయర్రంపాలెంలో ఎన్నికల ప్రచారం

గోకవరం: గత ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెంలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలు, మహిళలు, రైతులు ఇలా అన్నివర్గాల ప్రజలకూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, సుంకర వీరబాబు, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, ఉప సర్పంచ్ దాకారపు ధర్మరాజు, వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, కర్రి శివరాకృష్ణ, సుంకర వెంకటరమణ, సమ్మెటి మోహన్, శింబోతుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



జి.కొత్తపల్లిలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎస్సై కిశోర్

శంఖవరం: వచ్చే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని అన్నవరం ఎస్సై ఐ.కిశోర్ కోరారు. మండలంలోని జి.కొత్తపల్లి, గౌరంపేట గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల విధులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఓటర్లు ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోపాలకు గురి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధితుడికి చేయూత



ఒంటిమామిడిలో అర్జున్‌రావుకు ఆర్థిక సాయం అందిస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు

తొండంగి: మండలంలోని ఒంటిమామిడికి చెందిన బాధితుడి కరక అర్జునరావుకు శ్రీస్ఫూర్తి ప్రజాసేవా టీమ్, శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు చేయూతనందించారు. అర్జునరావుకు బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్ కావడంతో వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న శ్రీస్ఫూర్తి ప్రజాసేవా టీమ్ యువకులు రూ.50 వేలు, శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నేమాల శ్రీనివాసరావు రూ.10 వేలు కలిపి మొత్తంగా రూ.60 వేల నగదును గురువారం బాధితుడు అర్జునరావుకు అందజేశారు. కార్యక్రమంలో ప్రజాసేవా టీమ్ సభ్యులు పెండ్యాల ఈశ్వరుడు, పూర్ణ, సింహాద్రి, మణికంఠ, రాము, శ్రీను, నాని, శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు రాజన రామకృష్ణ, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం... కమనీయం

- వైభవంగా స్వామివార్ల కల్యాణం
- అధిక సంఖ్యలో వీక్షించిన భక్తులు



ధర్మవరంలో రాజగోపాలస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవం గురువారం కన్నులపండువగా జరిగింది. బుధవారం రాత్రి ఆంజనేయ, గరుడ, పొన్న, పల్లకీ, హంస వాహనాలపై స్వామి, అమ్మవార్లను మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. అనంతరం ఆలయ అర్చకుడు పాడుగు ప్రసాదాచార్యులు ఆధ్వర్యలో రుత్విక్కులు స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఏలేశ్వరం: పట్టణంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరాస్వామివారి వార్షిక కల్యాణం గురువారం ఘనంగా జరిగింది. స్థానిక బాలాజీ చౌక్‌లోని స్వామి, అమ్మవార్లకు ఆలయ ధర్మకర్త గోపు వెంకట్రావు, సుబ్బయ్యమ్మ నేతృత్వంలో అర్చకుడు సుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పండితులు గోపు శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి, కటకం బాలాజీ దంపతులతో స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా రాజగోపాలస్వామి కల్యాణం



లింగంపర్తిలో స్వామి, అమ్మవార్ల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



ఏలేశ్వరంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని లింగంపర్తిలో వేంచేసిన రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి వారి వార్షిక కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. లింగంపర్తిలో రాజగోపాలస్వామి ఆలయంలో అర్చకులు వింజరపు వెంకటప్రసాద్, సత్యరామగోపాల్ ఆధ్వర్యంలో అవసరాల కిషోర్, దేవి దంపతుల చేతులమీదుగా కల్యాణం ఘనంగా నిర్వహించారు. శ్రీమాన్ చక్రవర్తుల రాఘవచార్యుల శిష్య బృందం క్రతువులు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవసరాల సీతారామమూర్తి, అవసరాల వెంకటరాయుడు, ఉడతల రమణారావు పాల్గొన్నారు.

ధర్మవరంలో...

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో వేంచేసిన రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి వారి వార్షిక కల్యాణం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం పండితులు స్వామివారికి నిత్యహోమం, ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా సూర్యదేవుని శాంతి కల్యాణం



తిరుమలాయపాలెంలో సూర్యదేవుని ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెంలో గురువారం ఉషాపద్మినీ సమేత సూర్యనారాయణస్వామి శాంతి కల్యాణం ఘనంగా జరిగింది. సనాతన ధర ప్రబోధనా సమితి ఆధ్వర్యంలో తొలుత ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఘనంగా ఊరేగించారు. అనంతరం శాంతి కల్యాణం జరిపారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు తోట సాయిబాబు మాట్లాడుతూ సూర్యతత్వాన్ని ప్రజలకు తెలియజేస్తూ ప్రజలను సూర్యోపాసనకు దగ్గర చేయాలనే సంకల్పంతో ప్రతి గ్రామంలోనూ సూర్యదేవుని శాంతి కల్యాణం నిర్వహించాలని సంకల్పించామన్నారు. కార్యక్రమంలో చందనం వెంకటేశ్వరరావు, కొప్పాక కమల, చెన్నంశెట్టి మహేష్, చాగంటి సత్యనారాయణ, పిల్లంగోరు పాపారావు, కొత్తపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఆర్థిక సాయం



సంఘం అధ్యక్షుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఆంధ్రు మినరల్స్ మేనేజర్ రామస్వామి

ప్రత్తిపాడు రూరూర్: మండలంలోని పెదశంకర్లపూడిలో నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి వంతాడ ఆంధ్రు మినరల్స్ కంపెనీ రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. కాగా ఈ మొత్తాన్ని గురువారం ఆంధ్రు మినరల్స్ కంపెనీ మేనేజర్ రామస్వామి మండల నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు యండమూరి రామకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో యండమూరి నూకరాజు, రాజారపు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో ఆత్మీయ సమావేశం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వరుపుల తమ్మయ్యబాబు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సత్యప్రభను అత్యధిక మెజారీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.